# బహుమానం

-కారంపూడి వెంకట రామదాస్

ఆఫీసు బోయ్ సైదులు సేలరీ స్లిప్స్ ఒక్కొక్కరికీ అందిస్తూ నావద్దకొచ్చాడు. అతడు అందించిన స్లిప్‌ని వణుకుతున్న చేతులతో తీసుకున్నాను. నా చేతులు వణకడానికి కారణం లేకపోలేదు. అది నా మొదటి శాలరీ స్లిప్.

"కంగ్రాట్స్ సతీష్ ఫర్ గెటింగ్ యువర్ ఫస్ట్ శాలరీ" అంటూ కొలీగ్ కామేష్ మొదటగా విషెస్ చెప్పాడు.

"అవును సార్. ఫస్ట్‌మంత్ సేలరీ తీసుకున్నావ్. దావత్ ఎప్పుడిస్తున్నావు?" చనువుగా అడిగాడు సైదులు.

"సర్లే చూద్దాం" అన్నాను నవ్వేస్తూ.

"అదేంటి సతీష్! నువ్వు మా అందరికీ పార్టీ ఇవ్వక తప్పదు. ఇక్కడ ఎవరు కొత్తగా జాయిన్ అయినా వారి మొదటి సేలరీలో పార్టీ ఇవ్వాల్సిందే" పట్టుబట్టాడు కామేష్.

ఆ మాటల్ని నేను పెద్దగా పట్టించుకోలేదు. నా ఆలోచనలు వేరే విధంగా ఉన్నాయి. మొదటి సేలరీ అందుకున్నందుకు ఏదో థ్రిల్‌గా ఉంది.

ఎంతో కష్టపడి సంపాదించిన ఉద్యోగం. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలని ఎన్నో కలలు కన్నాను.

చదువు పూర్తిచేసి సంవత్సరంపాటు ఉద్యోగం కోసం పడరాని పాట్లు పడ్డాను. ఎన్నో ఛీత్కారాలను ఎదుర్కొన్నాను. నిరుద్యోగి జీవితం ఎంత దుర్భరమో నాకు పూర్తిగా అర్థమయింది. వీటన్నిటినీ తట్టుకుని చివరికి ఈ ఉద్యోగం సాధించాను. ఈ నా విజయం వెనుక నా తల్లిదండ్రులు చేసిన ఎన్నెన్నో త్యాగాలు ఉన్నాయి.

అందుకే నేనందుకున్న ఈ నా తొలి సంపాదన నాకు చాలా అమూల్యమైనది, పవిత్రమైంది. అటువంటి ఈ సంపాదన పార్టీ పేరుతో జల్సా చేయడమా?

ఎందుకో నా మనస్సు ఒప్పుకోలేదు. అందుకే ఎవరెంత వత్తిడి చేసినా 'ఆ...ఊ...' అంటూ అప్పటికి దాటేసాను.

"సారూ! మీదేనా ఈ లెటరు" అంటూ సైదులు నాకో ఉత్తరం అందించాడు.

చేతి వ్రాతనిబట్టి అది నాన్న దగ్గర నుండి వచ్చిందని పోల్చుకున్నాను.

"అవును.. నాదే. మా ఇంటి నుంచి వచ్చింది"అంటూ సంబరంగా ఉత్తరం చించాను.

"చిరంజీవి సతీష్‌కి!

అనేక దీవెనల తరువాత మీ నాన్న వ్రాయునది. మేమంతా క్షేమం. అక్కడ నువ్వు క్షేమమని తలుస్తాను. నీ కొత్త ఉద్యోగం ఎలా వుంది. రాబోయే ఆదివారం మీ అమ్మ అరవైయ్యో పుట్టినరోజు. అంటే షష్టిపూర్తన్నమాట. మీ అన్నావదినా అంతా కలసి పుట్టినరోజును సంప్రదాయబద్ధంగా జరపాలని పట్టుబట్టారు. అందుకే అమ్మకి ఇష్టం లేకపోయినా ఒప్పుకోక తప్పలేదు. అంతా ఆ రోజుకి వస్తున్నారు. నీకు శని, ఆదివారాలు ఎలాగూ సెలవు కాబట్టి తప్పకుండా రా. మీ అమ్మ నిన్ను మరీ మరీ రమ్మనమని చెప్పింది.

ఇట్లు
మీ నాన్న"

అమ్మ పుట్టినరోజు. అందులోనూ షష్టిపూర్తి. చాలా మంచి వార్త.

రాబోయే ఆదివారం...అంటే ఇంకా మూడు రోజులే వుంది. రెండురోజులు ఎలాగూ సెలవులే. కాబట్టి ప్రత్యేకంగా సెలవు పెట్టవలసిన అవసరంలేదు.

ఇక మా ఊరు విజయవాడ దగ్గరే కాబట్టి రిజర్వేషన్ల సమస్యలేదు. అప్పుడే నా మనసు ఇంటి వైపు మళ్ళింది.

ఆఫీసు పని పూర్తయ్యాక బయటపడ్డాను. బండి తీసి హైటెక్ సిటీ నుండి అమీర్‌పేట వైపు కదిలాను.

హెవీ ట్రాఫిక్ మధ్య నా బైక్ స్లోగా కదులుతున్నది. చివరికి ఓ పెద్ద బిల్డింగ్ ముందు ఆగాను. బైక్‌ని పార్కింగ్ ప్లేస్‌లో పార్క్ చేసి ఆ బిల్డింగ్‌లోకి నడిచాను.

★★★

నన్ను చూసిన అమ్మ ఆనందానికి అవధుల్లేవు.

"వచ్చావురా! రా...రా! నీ కోసమే అంతా ఎదురు చూస్తున్నాం. అసలే నీది కొత్త ఉద్యోగం. వస్తావో రావో అనే చిన్న అనుమానం. మొత్తానికి వచ్చావు చాలా సంతోషం" అమ్మ నా చేతులు పట్టుకుని సంబరంగా చెప్పుకుని పోతుంటే నాకు భలే తమాషాగా అనిపించింది.

"ఇంత ముఖ్యమైన నీ షష్టిపూర్తి రోజుకు రాకుండా ఎలా వుండగలననుకుంటున్నావు?" అమ్మతో అన్నాను.

ఇంటి నిండా బంధువులు, అన్నయ్య, వదిన, అక్కా బావా, పినతండ్రులు, పిన్నమ్మలు... ఇలా అందరితో ఇల్లంతా కళకళలాడుతుండడం నాకు ఏదో చెప్పలేని సంతోషాన్నిచ్చింది.

ఇంతలో నాన్న వచ్చి నన్ను పలకరించి వెళ్లి రెడీ అవమని చెప్పి ఏదో పనుందంటూ వీధిలోకి వెళ్లారు.



నేను నా గది చేరుకుని ఫ్రెషప్ అవ్వడానికి సిద్ధమయ్యాను.

★★★

"ఒరే తమ్ముడూ! ఇది చూడరా... అమ్మకి పట్టుచీర, నాన్నకి పట్టుపంచా. ఎలా వుందో చెప్పు?" అక్క నాతో అంటూ తను కొన్న కొత్త బట్టలు చూపించింది.

"చాలా బాగుందక్కా. అమ్మకీ రంగు చాలా నప్పుతుంది. చాలా మంచి సెలక్షన్" మెచ్చుకుంటూ అన్నాను.

"అది సరే... ఇంతకీ నువ్వేం బహుమతి ఇస్తున్నావో చెప్పలేదు. అంత రహస్యమా?" అంది నవ్వుతూ అక్క.

"అదీ...అదీ" అంటూ చెప్పబోయిన నాకు అడ్డుపడుతూ-

"సారీరా... నువ్వింగా కొత్తగా ఉద్యోగంలో చేరావుకదా" నొచ్చుకుంటూ అంది అక్క.

నేను చిన్నగా నవ్వి ఊరుకున్నాను.

ఇంతలో వదిన అటుగా వచ్చింది.

"ఏంటట్రా...ఏంటీ హడావుడి? అదేంటో నాక్కూడా చెబితే నేనూ సంతోషిస్తాగా" అంటూ కల్పించుకుంది.

"అదీ... ఈ చీర ఎలా వుందంటావు వదినా?" అంటూ అమ్మకు కొన్న పట్టుచీర చూపించింది అక్క.

"ఫెంటాస్టిక్... చాలా బాగుంది" అంటూ మెచ్చుకుంది వదిన.

"అది సరే... ఇదెలా వుంది?" అంటూ వదిన చిన్న ప్లాస్టిక్ పెట్టెలో వున్న బంగారు ఉంగరం తీసి చూపించింది.

"బాగుంది మంచి సెలక్షన్" అంటూ అక్క మెచ్చుకుంది. నేను వంత పాడాను.

"అది సరే.. సతీష్! అమ్మకి నువ్వేం ఇస్తున్నావు?" అని నన్ను ప్రశ్నించింది వదిన.

నేను సమాధానం చెప్పేలోపే-

"సరే...సరే.. పదండి...పదండి. పురోహితుడు వచ్చేసాడు" అంటూ హడావుడిగా వదిన వెళ్లిపోయింది.

ఉదయం పదకొండు గంటల సుముహూర్తానికి పురోహితుడు శాస్త్రోక్తంగా షష్ఠిపూర్తి జరిపించారు. వచ్చిన బంధువులంతా ఆ వేడుకను ఎంతో ఆసక్తితో తిలకించారు.

తరువాత సత్యనారాయణ వ్రతం. ఆ తరువాత శాస్త్రానికి నాన్న అమ్మ మెడలో తాళి కట్టి దండలు మార్చుకున్నారు. అంతా చప్పట్లలో ఆ దృశ్యాన్ని తిలకించారు.

తరువాత ఒక్కొక్కరే అమ్మానాన్నల పాదాలకి దండం పెట్టి వారి ఆశీర్వాదాన్ని అందుకున్నారు.

అక్కయ్య, బావా అమ్మానాన్నలకి బట్టలు పెట్టారు. అన్నావదినెలు అమ్మకి బంగారు ఉంగరం, నాన్నకి బట్టలు పెట్టారు. మిగతా బంధువర్గమంతా తలో కానుక ఇచ్చారు.

నేను కూడా ప్రత్యక్ష దైవాలయిన అమ్మానాన్నల పాదాలకి దండం పెట్టాను.

అమ్మానాన్నలు మనస్ఫూర్తిగా నన్ను ఆశీర్వదించారు.

భోజనాలు అవీ బాగానే ఏర్పాటు చేసారు. వంటలు కూడా అద్భుతంగా ఉండడంతో అంతా మెచ్చుకోకుండా ఉండలేకపోయారు. వచ్చినవారందరూ తృప్తిగా భోజనాలు చేసారు.

భోజనాలు ముగిసాక బంధువులందరూ అమ్మానాన్నలకు బెస్ట్ విషెస్ చెప్పి వెళ్లిపోయారు.

అమ్మానాన్నలు తమ గదిలో బావా అన్నయ్యలతో ఏదో ముచ్చటిస్తున్నారు.

సరిగ్గా అప్పుడే నేనక్కడికొచ్చాను.

అమ్మ పక్కన చోటు చేసుకుని కూర్చుంటూ "అమ్మా" అన్నాను.

"ఏంట్రా" అంటూ ఆప్యాయంగా నా తల నిమిరింది.

"అదీ...అదీ... నీ చెయ్యి చాపు" అన్నాను.

ఎందుకో అర్థంకాక ఆశ్చర్యపోతూ అమ్మ చేతులు చాపింది.

జేబులో నుండి ఎర్ర కాగితంలో చుట్టిన బంగారు గాజుల్ని తీసి అమ్మ చేతికి తొడిగాను.

అమ్మ ఆశ్చర్యపోయింది. ఆ ఆశ్చర్యం వెనుక ఆనందం కూడా స్పష్టంగా కనబడుతోంది.

అమ్మేకాదు నాన్న, అక్కడున్న బావా అన్నయ్యలు కూడా ఆశ్చర్యపోయారు.

"ఒరే ఏంట్రా? ఈ బంగారు గాజులు ఇప్పుడు నాకు దేనికిరా? అయినా ఇంత ఖరీదు పెట్టి ఇప్పుడు నాకివి అవసరమా? ఆ డబ్బుతో నీకు కావాల్సింది ఏమైనా కొనుక్కోవచ్చు కదా. మీరంతా సంతోషంగా ఇలా నా కళ్లముందు తిరుగుతుంటే నాకు అదే పదివేలు" చాలా డబ్బు పోసి కొన్నానని మెచ్చుకుంటూ అంది అమ్మ.

"అది కాదమ్మా. ఇది నా మొట్టమొదటి కష్టార్జితం. అంటే నా మొదటి నెల జీతంతో కొన్నదన్నమాట. ఇది నా చిరకాల కోరిక. రెండు సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన నువ్వు మరచిపోయావేమోగానీ నాకు ఇంకా గుర్తుంది."

అమ్మ ఏదో గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. నాన్న కూడా ఆలోచనలో పడ్డారు.

నాకు ఆ రోజు సంఘటన కళ్లముందు కదిలింది.

★★★

ఆరోజు కాలేజీ నుండి నీరసంగా ఇంటికి చేరుకున్నాను. రెండురోజుల్లో ముప్పైవేలు కట్టాలి.

అది నాన్నకి చాలా భారమే. అయినా తప్పదు. దీని గురించే అమ్మానాన్న రాత్రింబవళ్లు ఆలోచిస్తూ నిద్రలేమి రాత్రులు గడుపుతున్నారన్న విషయం నాకు తెలుసు.

నా చదువు మూలంగా ఇంట్లో ఎన్ని ఇబ్బందులో అని అనుకోకుండా ఉండలేకపోయాను.

ఇంటికి చేరిన నాకు బయట గదిలో ఎవరూ కనబడలేదు. అంతా ఏమయ్యారనుకుంటుంటే లోపల నాన్నగారి గదిలో నుండి మాటలు వినబడ్డాయి. ఎవరా అని చూస్తే లోపల అమ్మా నాన్న మాట్లాడుకుంటున్నారు నా గురించే.


వారి మాటలు ఆసక్తిగా విన్నాను.

"ఏమండీ! ఇప్పుడేం చేద్దాం?" ఆందోళనతో అంది అమ్మ.

## 'రెడ్‌క్రాస్' ఎప్పుడు పుట్టింది?

1859వ సంవత్సరం జూన్‌లో సాల్ఫెరినో యుద్ధం సమాప్తమవుతున్న సమయం. యుద్ధభూమిలో ఎన్నోవేలమంది క్షతగాత్రులు సరైన వైద్య సదుపాయం అందక విలవిలలాడుతున్నారు. అదే సమయంలో ఆ ప్రాంతం పక్కనుంచి ప్రయాణిస్తున్న హెన్రీడ్యూనాంట్ అనే స్విస్ జాతీయుడు ఈ దృశ్యం చూసి చలించిపోయాడు. అక్కడికి సమీపంలోనే ఉన్న ఒక ఇటాలియన్ గ్రామంనుంచి కొందరు మహిళలను కూడగట్టుకుని క్షతగాత్రులకు వైద్యసాయమందించాడు. యుద్ధరంగంలో క్షతగాత్రులకు జాతివివక్ష లేకుండా తక్షణ వైద్య సదుపాయమందించేందుకు ఒక సంస్థను ఏర్పాటు చేస్తే యుద్ధ సమయంలో ఎన్నో మరణాలను నివారించవచ్చని సూచించాడు. డ్యూనాంట్ చేసిన ప్రతిపాదనను పన్నాలుగు దేశాలు జెనీవాలో జరిగిన ఓ అంతర్జాతీయ సమావేశంలో 'రెడ్‌క్రాస్' తీర్మానం ఆమోదించాయి. 1864లో ఆమోదించిన దానిని తిరిగి 1906లో సవరించారు. రెడ్‌క్రాస్ ఎంబ్లమ్‌గా స్విస్ జెండాకు కొద్దిగా రంగులు మార్చి ఎన్నుకున్నారు. నేడు రెడ్‌క్రాస్ పేరిట అనేకమంది సంయుక్తంగా ఎక్కడైనా ప్రకృతి వైపరీత్యం జరిగినప్పుడు కాని, యుద్ధం జరిగిన సమయంలో కాని తమ సేవలను అందిస్తున్నారు. ఈ సంస్థను మిత్ర, శత్రు భేదం లేకుండా గౌరవిస్తుంటారు. బ్రిటిష్ రెడ్‌క్రాస్ సొసైటీని 1870లో ఏర్పాటు చేశారు. బ్రిటిష్ సేనలకు వైద్య సదుపాయం ఉన్నప్పటికీ యుద్ధ సమయంలో రెడ్‌క్రాస్ అదనపు సాయాన్ని అందిస్తుంటుంది.

-కె.మంజువాణి



"పూర్ణా! నాకూ ఏమీ పాలుపోవడంలేదు. ఇంకా రెండురోజులే టైం వుంది. ఈ రెండురోజుల్లో ఏదో విధంగా ఏర్పాటు చేయాలి" అమ్మతో అంటున్నాడు నాన్న.

"అయినా ఇవేం ఫీజులండీ? మొన్నటికి మొన్న పదివేలు కట్టాం. రెండు నెలలు గడిచాయో లేదో మళ్లీ ముప్పైవేలు" అసహనంగా అంది అమ్మ.

"ఎంసిఎ అంటే అంతే. ఆ మాట కొస్తే ఈ రోజుల్లో అన్ని చదువులూ అంతే."

"పెద్దోడిని అడిగి చూద్దాం" అన్నారు నాన్న.

"వద్దులెండి. వాడు మాత్రం ఇప్పటికిప్పుడు ఎక్కడనుండి తెస్తాడు?"

"అదీ నిజమే. కానీ మరో ఉపాయం తోచడంలేదు."

"నేనొకటి చెప్తాను. మీరేమీ అనరుకదా" సంకోచంగానే అంది అమ్మ నాన్నకేసి చూస్తూ.

ఆశ్చర్యంగా ఏమిటన్నట్లు చూసారు నాన్న.

"అదీ...అదీ... ఇప్పుడు నా చేతికి గాజులు లేకపోతేనేం?"

ఈ మాటలకి నేను నిర్ఘాంతపోయాను.

అందుకు కారణం లేకపోలేదు. అమ్మకి ఆ గాజులంటే చాలా ఇష్టం. వాటిని అమ్మమ్మ పెట్టిందని ఎంతో అపురూపంగా చూసుకునేది. అటువం టిది ఇప్పుడు నాకోసం వాటిని వదులుకునేందుకు సిద్ధపడడం నాకు చాలా బాధ కలిగించింది.

చప్పున అమ్మకేసి చూసారు నాన్న.

"పూర్ణా వద్దు. వాటిని నీ పుట్టింటివారు ఇచ్చారు. వారి గుర్తుగా నీవద్దనే వుండనీ"

"అలా అంటే ఎలాగండీ. ఈ సమస్య నుండి ఎలా బయటపడేది? మన బిడ్డల భవిష్యత్తు కోసం ఇంతకుముందు మీరు చాలా త్యాగాలు చేసారు. నేను ఈపాటి త్యాగం చేయలేనా?" అంది అమ్మ.

గత్యంతరంలేని పరిస్థితిలో నాన్న మౌనంగానే అమ్మ ప్రతిపాదనకి ఆమోదముద్ర వేసారు.

"ఏమండీ! ఈ విషయం ఇంట్లోవాళ్లకి తెలియనివ్వకండి. ముఖ్యంగా సతీష్‌కి" అంటూ అమ్మ తన చేతికున్న గాజుల్ని తీసి నాన్న చేతిలో పెట్టింది.

నాన్న అయిష్టంగానే వాటిని అందుకున్నారు.

నాకు తెలియకుండానే నా కంటివెంట కన్నీళ్లు కారాయి.

"అమ్మా! ఆ రోజు నువ్వు నాకు ఏది తెలియకూడదనుకున్నావో ఆ సంఘటనను ప్రత్యక్షంగా నేను చూసాను. తల్లిదండ్రుల ఎన్నో త్యాగాల ఫలమే పిల్లల బంగారు భవితం అని తెలుసుకున్నాను. ఆ రోజే నేను నిశ్చ యించుకున్నాను. నేను సంపాదించే తొలి సంపాదనతో నీ చేతికి నేను బంగారు గాజులు తొడగాలనీ. అందుకే ఇవి తెచ్చాను. ఒక విధంగా నా మొదటి జీతం సద్వినియోగమే కాదు, నా బాధ్యత కూడా నిర్వర్తించే అవ కాశం నాకు ఈ విధంగా కలిగింది" అన్నాను కాసింత ఉద్వేగంగా కళ్లు చెమర్చుతుండగా.

అమ్మ కళ్లల్లో ఆనందభాష్పాలు. నాన్న చూపులు నావైపు మెచ్చుకో లుగా చూసాయి.

అప్పుడే అక్కడికొచ్చి అంతా విన్న అక్క వదినలతోపాటు అన్నా, బావా చప్పట్లతో నన్ను అభినందించారు.

"ఒరే తమ్ముడూ! బాగా ఆలోచించి చాలా మంచి పని చేసావురా. ఏ తల్లికైనా ఇంతకంటే ఏం కావాలి? వెల్‌డన్."

"అవును సతీష్. నువ్వన్నది నిజమే. నీలా అందరు కొడుకులూ ఆలో చిస్తే తల్లిదండ్రుల త్యాగాలకి ఓ అర్థం వుంటుంది" అంది వదిన నన్ను మెచ్చుకుంటూ.


***

ఉదయం పదిగంటలు. ఆఫీసులో అందరూ బిజీగా ఉన్నారు.

ఆ రోజు ఆఫీసులో అడుగుపెడుతూనే నా వెంట తెచ్చిన పుల్లారెడ్డి స్వీట్స్ స్టాఫ్ అందరికీ స్వయంగా పంచుతూ "ఇది నా తొలి జీతం అందు కున్న సందర్భంగా" అంటూ చెప్పాను.

"భలే గడుసువాడివి, చీప్‌గా తేల్చేసావు" అంటూ మొహంమీద కొందరూ, "పిసినారి, లోభి" లాంటి బిరుదులు నా వెనుకగా మరికొందరు నాకివ్వడం లాంటివి నేను పెద్దగా పట్టించుకోలేదు.

★



## అందాల మమత!

జగపతి బాబు-మమతా మోహన్‌దాస్ జంటగా నటించిన 'హోమం' మొత్తానికి రిలీజయేందుకు సిద్ధమవుతోందిట. ఈ సినిమా షూటింగ్ సమ యంలో దర్శకుడు-నటుడు జె.డి.చక్రవర్తికి మమతా మోహన్‌దాస్‌తో వచ్చిన 'కొన్ని' విభేదాల కారణంగా నిర్మాణానికి 'కాస్త' ఆలస్యం అయిం దని సినీ జనాలు అనుకుంటున్నారు. ఈ సినిమాలో చాలా హాట్ హాట్‌గా కనిపిస్తుంది మమత. బయటికొచ్చిన కొన్ని స్టిల్స్ చూస్తేనే చెప్పవచ్చు మమతా అందాల ఆరబోత గురించి. మరి ఇవన్నీ ఆమె కెరీర్‌కి ఎంతగా ఉపయోగపడతాయో చూడాలి!

